ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలోని నల్లపోచమ్మ దేవాలయ 18వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో దంపతులు కలశ పూజ జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుధీర్, విశ్వనాథ్, నవీన్, మహేష్, సునీల్‌పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ల ముట్టడి

ఎల్‌బీనగర్: తెలంగాణలోని అన్ని కలెక్టరేట్ల కార్యాలయాల ఎదుట సోమవారం ఉదయం 10 గంటలకు మహాధర్నా నిర్వహించనున్నట్లు చెలిమండ్ల గోవర్ధన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పెన్షన్ దారులకు రూ. 4 వేలకు పెంచుతామని రేవంత్‌రెడ్డి సర్కార్ హామీ ఇచ్చి 20 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా పెన్షన్ పెంచలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యాలయాలకు ఆసరా పెన్షన్‌దారులు తరలివచ్చి ముట్టడించాలన్నారు.

సన్మానం


యాదగిరిని సన్మానిస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: సెక్రటేరియేట్‌లో అడిషినల్ సెక్రటరీగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన యాదగిరి పదవీవిరమణ అభినందన కార్యక్రమాన్ని ఆదివారం మల్లికార్జున నగర్ నార్త్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీహాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ హాజరై శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, నెహ్రూ, మధుసూధన్‌రెడ్డి, రవికుమార్, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణారావు పాల్గొన్నారు.

నివాళి


రావినారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: నిజాం ప్రభుత్వంపై పోరాడిన ఘనుడు రావి నారాయణరెడ్డి అని పలువురు కొనియాడారు. ఆదివారం హయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రావి నారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రజాకార్ల ఆగడాలు అరికట్టడానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటు చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రిశోభన్, వంశీవర్ధన్‌రెడ్డి, కర్నె సుజాత, మందుల కృష్ణ, నాగరాజు, సరిత, సురేందర్, అరుణ, పారిజాత, సౌజన్య, యమున, సుమతి, అలివేణి, శివజ్యోతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ధన్యవాదాలు


పారిశుద్ధ్య సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనులో గత 10 రోజులుగా నిమజ్జనంలో ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తిచేసిన వివిధ శాఖల సిబ్బందికి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం కొలను వద్ద కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ సిబ్బందితో పాటు వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో రాత్రింబవళ్లు శ్రమించి గణనాథుల నిమజ్జన ప్రక్రియను సజావుగా పూర్తిచేశారన్నారు.

ట్రాఫిక్ చిక్కులు.. నిత్యం తిప్పలు

విస్తరణకు నోచుకోని జాతీయ రహదారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు


మలక్‌పేట్‌లోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌జామ్

దిల్‌సుఖ్‌నగర్: రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో వాహనదారులకు శాపంగా మారుతోంది. పగలు రాత్రీ తేడా లేకుండా గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో నిత్యం నరకవ చవిచూస్తున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. ఉద్యోగాలు, వివిధ పనుల కోసం ఉదయం బయలుదేరినా ట్రాఫిక్ జామ్‌తో సరైన సమయానికి చేరుకోలేక పోతున్నామని సాయంత్రం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. విద్యార్థులు సైతం సరైన సమయానికి చేరుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

ప్రధాన చౌరస్తాలో నరకమే..

దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, మూసారంబాగ్, మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, సైదాబాద్, చాదర్‌ఘాట్‌లో నిత్యం వాహనదారులు, పాదచారులు నరకం అనుభవిస్తున్నారు. ప్రతిరోజు రద్దీగా ఉండి వాహనదారులతో కిటకిటలాడే దిల్‌సుఖ్‌నగర్‌లోని జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను అదుపు చేయడంలో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, సరూర్‌నగర్ పరిధిలోని ప్రధాన చౌరస్తాలలో ప్రతి నిత్యం ట్రాఫిక్ ఉదయం సాయంత్రం వేళల్లో అంతరాయం కలుగుతుంది.

కానరాని ట్రాఫిక్ పోలీసులు

అయితే ట్రాఫిక్ పోలీసులు కాస్త చొరవ తీసుకుంటే ఎంతోకొంత ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించ వచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాల్సింది పోయి కేవలం చలాన్‌లపైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే వాహనాలు, తోపుడు బండ్ల వారి నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించే షాపింగ్‌మాల్స్, వైన్స్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్, ఫంక్షన్‌హాళ్లు, కల్లు కాంపౌండ్, లారీ అడ్డాల ముందు అక్రమ పార్కింగ్ చేసినా అటువైపు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల్లో జాతీయ రహదారి..

జాతీయ రహదారిపై ప్రయాణం ట్రాఫిక్ అడుగడుగునా అడ్డంకులను సృష్టిస్తోంది. రోజురోజుకు జాతీయ రహదారి ఆక్రమణకు గురవుతోంది. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్‌బీనగర్‌లో జాతీయ రహదారిపైనే అక్రమ వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యల తలెత్తుతోంది. దీనికితోడు రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడం ప్రధాన సమస్య. పది నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యాన్ని రెండు గంటలైనా చేరుకోలేకపోతున్నారంటే నగరంలో ట్రాఫిక్ ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం, సాయంత్రం వేళలో ఈ ససమస్య జఠిలంగా మారుతోంది. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి చాదర్‌ఘాట్ వరకు ట్రాఫిక్ జామ్ లేని రోజే ఉండదని వాహనదారులు పేర్కొంటున్నారు.

ఇలా చేస్తే కాస్త ఊరట

- అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ చేపట్టాలి.
- రద్దీ ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించి వాహనాలను నియంత్రించాలి.
- 7 సీటర్ ఆటోలను రద్దీ సమయంలో ఎల్‌బీనగర్‌కు రాకుండా నిషేధించాలి.
- సర్వీస్ రోడ్లపై అక్రవు పార్కింగ్‌లను తొలగించి చిన్న వాహనాలను ఈ దారివైపు మళ్లించాలి.
- ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలాఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి.




చంద్రగ్రహణం వీక్షణ

డివిజన్ పరిధి ఆగమయ్యనగర్‌కాలనీలోని రాజమ్మ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటే ఖగోళ శాస్త్రవేత్త శంభుప్రసాద్ అధునాతన టెలిస్కోప్‌తో చంద్రగ్రహణం వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఆదివారం రాత్రి 9.57 నిమిషాలకు చంద్రగ్రహణం ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు.

మన్సూరాబాద్



బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సైదాబాద్: అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సైదాబాద్ మాతా మైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతా ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి వేడుకలు విజయ దశమి రోజు అక్టోబర్ 2న ముగుస్తాయన్నారు. అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హరిదేశాయ్, అశోక్‌కుమార్, సునీల్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, రవిశంకర్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం అందజేత


రాంచంద్రరావుకు ప్రసాదం అందచేస్తున్న లింగాల దశరథగౌడ్

చంపాపేట: బాలాపూర్ గణనాథుడి లడ్డూను రూ. 35 లక్షలకు కైవసం చేసుకున్న చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథగౌడ్ ఆదివారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డితో కలిసి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 184 గణేష్ విగ్రహాలను శనివారం రాత్రి 3 గంటల వరకు పూర్తి స్థాయిలో నిమజ్జనం చేసినట్లు చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి తెలిపారు. వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగాయని రాబోయే పండగలను కూడా కలిసికట్టుగా జరుపుకోవాలని ఈ సందర్భంగా మురారి సూచించారు.

5880 విగ్రహాల నిమజ్జనం


మినీ ట్యాంక్‌బండ్‌లో కొనసాగుతున్న నిమజ్జనాలు



చైతన్యపురి: గణేష్ నవరాత్రి ఉత్సవల్లో భాగంగా సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఇప్పటి వరకు సుమారు 5880 విగ్రహాలు నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి చంద్రగ్రహణం ఉండటంతో ఈ ఏడాది మండప నిర్వాహకులు ముందే నిమజ్జనం చేశారు. నిమజ్జనం కోసం 8 క్రేన్లు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి మూడు క్రేన్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతారణంలో నిమజ్జన కార్యక్రమం జరగటంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జనోత్సవాలు



చార్మినార్: పాతబస్తీ శివారులోని బాలాపూర్ నుంచి శనివారం ఉదయం ప్రారంభమైన నిమజ్జనోత్సవ శోభాయాత్ర అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. బాలాపూర్, చాంద్రాయణగుట్ట, షంషీర్‌గంజ్, అలియాబాద్, శాలిబండ, మక్కా మసీదు, చార్మినార్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ ద్వారా అఫ్జల్‌గంజ్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరింది. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తి తదితరుల ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద బందోబస్తులోని పోలీసు అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు, శాంతి సంఘం సభ్యులు, భక్తులను వారు అభినందించారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.27, బీరకాయ రూ.41, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.45, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.25, కీర రూ.15, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.53. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

9న యూనిట్ సమావేశం

నాగోలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాగోలు యూనిట్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నాగోలు కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు వై.వి. యం సుబ్బారావు, కార్యదర్శి బి.వి ప్రతాపరెడ్డి, కోశాధికారి అశోక్ కుమార్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సందేశం అనంతరం నాగోలు యూనిట్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా పెంచడం హర్షణీయం

మలక్‌పేట: నిర్మాణ రంగ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.6 నుంచి రూ.10 లక్షల వరకు పెంచడం హర్షణీయమని జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బ్యాగరి అనంతయ్య అన్నారు. ఆదివారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ.. సహజ మరణానికి రూ. 2లక్షల వరకు పెంచడం శుభపరిణామని, సంఘం పోరాట ఫలితమే ఈ పెంపుదల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వాలని, వారి పిల్లలకు స్కాలర్‌షిప్స్ కల్పించాలన్నారు.

గురువులకు సత్కారం



వనస్థలిపురం: డాక్టర్లు, ఇంజినీర్లు, పోలీసులు ఇలా అందరిని తయారు చేసేది గురువులేనని, గురువులు లేకపోతే సమాజం జ్ఞానహీనమవుతుందని లయన్స్ క్లబ్ వనస్థలిపురం ప్రెసిడెంట్ ఎస్.జే.ఎస్.నందకిషోర్ అన్నారు. లయన్స్ క్లబ్ వనస్థలిపురం ఆధ్వర్యంలో శనివారం రాత్రి 26 మంది గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దే శిల్పులు గురువులని కొనియాడారు. కార్యక్రమంలో రవిందర్, వి.కుమార్, శేషగిరిరావు, యువ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వద్నాల, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి


ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్‌కాంప్లెక్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, చైతన్యనగర్ కాలనీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, భూపాల్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, పోచమ్మ గుడి చైర్మన్ శివకుమార్, వెంకట్రాంరెడ్డి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



చాదర్‌ఘాట్: చంద్రగహణం సందర్భంగా ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయాన్ని ఆదివారం మూసివేశారు. సోమవారం ఉదయం దేవాలయ సంప్రోక్షణ (శుద్ధి) అనంతరం భక్తులకు ప్రవేశం, దర్శనం కల్పిస్తామని ఆలయ పూజారి వెల్లడించారు.

కర్మన్‌ఘాట్‌లో..

చంపాపేట: చంద్రగ్రహణ ప్రభావంతో ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ద్వారబంధనం చేశారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నివేదనలు జరిపిన అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేకాల అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని ఈఓ లావణ్య స్పష్టం చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేనా క్లీనిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ఆనంద్‌నగర్‌లో కొత్తగా నెలకొల్పిన రేనా క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యుసిడి ల్యాబ్స్ అధినేత రవీందర్‌గౌడ్, ల్యాబ్ టెక్నిషియన్లు రమేష్, అల్లమస్, సునీల్, సంగీత, పూజలు ఆనంద్‌నగర్, ధాత్రి కాలనీ వాసులు రక్త పరీక్ష, మధుమేహం, థైరాయిడ్ వంటి ఆరోగ్య పరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎలిజబెత్ మండేలా రోగులను పరీక్షించి తగు చికిత్స చేశారు. ఆనంద్‌నగర్ కాలనీ వాసులతో పాటు ధాత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండా ఆనందరెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి, గాజుల చంద్రశేఖర్, కె.చంద్రశేఖరరెడ్డి, సీనియర్ సిటిజన్లు కొంపెల్ల కామేశ్వరరావు, ఎన్.రామలింగం, ఉలిగేశ్వర్, టి.శంకర్, ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

జోరందుకున్న లడ్డూ వేలం

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో వినాయక లడ్డూ వేలం జోరందుకుంది. వివిధ మండపాల్లో నిర్వహించిన లడ్డూ వేలంలో పోటాపోటీగా పాల్గొని లడ్డూను దక్కించుకున్నారు. శనివారం సాయంత్రం మొదలైన వేలం పాటలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. లడ్డూ దక్కించుకున్న వారిని మండపాల నిర్వాహకులు సన్మానించారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


శాతవాహనగర్‌లో రూ. 1,53,116లకు లడ్డూ సొంతం చేసుకున్న సబిత శ్రీనివాస్


ఓల్డ్‌మలక్‌పేట శ్రీవినాయక ఫ్రెండ్స్ అసోషియేషన్ మండపంలో రూ. 1.50 లక్షలకు లడ్డూ దక్కించుకున్న మణికొండ వేణుగోపాలరావు


బండ్లగూడ సహభావన టౌన్‌షిప్ బీ-బ్లాక్‌లో రూ. 7.90 లక్షలకు లడ్డూ దక్కించుకున్న ఉపేందర్


రూ. 5. 22 లక్షలకు లడ్డూ దక్కించుకున్న రాజేంద్రప్రసాద్ కళ్యాణి దంపతులు


రూ. 2.55 లక్షలకు లడ్డూ దక్కించుకున్న శ్రీరాముని రామనాథం